జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 19 | ఆగస్టు | 2025 ◆ పేజీలు : 6




# అమర జవాన్ కు ఘన నివాళులు

- నివాళులర్పించిన ఎమ్మెల్యే విక్రమ్ మాండవి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఘాసీరామ్ నాగ్
- బస్తర్ ఐజి పీ సుందర్ రాజ్.

మిగతా 2 లో...

**చర్ల, ఆగష్టు 18 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని భోపాల పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ పార్క్ ప్రాంతంలోని చిల్లమర్క గ్రామం సమీపంలోని అడవిలో మావోయిస్టులు అమర్చిన ఐ ఈ డి బాంబు పేలుడులో ముగ్గురు డి ఆర్ జి జవాన్లు గాయపడగా, ఒక డి ఆర్ జి జవాన్ దినేష్ నాగ్



# ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం ...

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ఇల్లందు, ఆగస్ట్ 18, ప్రజాజ్యోతి:** గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఇల్లందులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులను పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీపై ఉన్న నమ్మకంతో ప్రజల దీవెనలతో కొలువుతిరిన ఇందిరమ్మ రాజ్యం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని పేర్కొన్నారు. రూ. 6 కోట్లతో మేడికుంట – రాంచంద్రపురం బ్రిడ్జి, రూ. 1.56 కోట్లతో జెకె కాలని

మిగతా 2 లో...





# మావోయిస్టుల దుశ్చర్య...

- ఐఈడి బాంబు పేలి ఒక డిఆర్ జి జవాన్ మృతి
- ముగ్గురు డిఆర్ జి జవాన్లకు గాయాలు
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

**చర్ల, ఆగష్టు 18 (ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలోని చిల్లమర్క అడవిలో సోమవారం ఉదయం నక్సలైట్లు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని అమర్చిన ఐ ఈ డి పేలుడులో

మిగతా 2 లో...



# భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి...

2 లో...

- లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు



# 'దృశ్యం' పదిలం...

- మధుర స్మృతులు శాశ్వతం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

2 లో..

● భద్రాచలం, ప్రజాజ్యోతి

కాలం పరుగెత్తుతోంది.. గడిచిన సమయం ఇక తిరిగి రాదనీ అందరికీ తెలిసిందే.. కానీ, ఆ గతం తాలూకు జ్ఞాపకాలను సజీవంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో.. అలాంటి ఫొటోలు మనల్ని ఎన్నో ఏళ్ల వెనుకకు తీసుకెళ్లగలవు.. గత మధురస్మృతులను గుర్తు చేయగలవు.. అలనాటి ఘటనలను నెమరువేయించగలవు.. అంతేకాకుండా ప్రకృతి అందాలను బంధించగలవు.. సుందర దృశ్యాలను ఎల్లకాలం నిలిపి ఉంచగలవు.. శుభకార్యాల గుర్తులు, గతించిన మనుషుల రూపాలు, ఇతర ఎన్నో సంఘటలను చిత్రాల రూపంలో తిరిగి చూపించగలవు.. అలా ఫొటోలు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం సెల్ఫీల రూపంలో మన దైనందిన జీవితంలోకి చొరబడ్డాయని కూడా చెప్పవచ్చు. అయితే, ఈ ఫొటోగ్రఫీకి కూడా ఒక రోజు ఉంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రజాజ్యోతి అందిస్తున్న కథనం..

## ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం ...

(మొదటి పేజీ తరువాయి...)

మినీ స్టేడియం ప్రహరీ గోడ, లైటింగ్, రూ. 3.06 కోట్లతో లలితాపురం రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణ మాఫీ, రైతు ఆత్మీయ భరోసా, రూ. 500 బోనస్, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లతో పాటు అవసరాన్ని బట్టి మరో 1000 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజారంజాక పాలన కొనసాగుతున్నప్పటికీ కొందరు కావాలని ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెబితారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జీతేష్ వీ. పాటిల్, డిఎస్పి ఎన్. చంద్రభాను, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పిఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, ఇల్లందు, టేకులపల్లి, గుండాల సీఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, రవీందర్, ఎస్ఐ హసీనా, అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడుగు సాంబ మూర్తి, మండల రాము, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, ఎస్. కె. జానీ, మాజీ మున్సిపల్ చైర్మన్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూయ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమర జవాన్ కు ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి...)

అమరుడయ్యాడు. అమరవీరుడైన సైనికుడి భౌతికకాయాన్ని సోమవారం బీజాపూర్ లోని రక్షిత కేంద్రమైన షహీద్ వాటికకు తీసుకువచ్చారు. అక్కడ గంభీరమైన వాతావరణంలో ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, జిల్లా పంచాయతీ అధ్యక్షురాలు జానకి కోర్సా, మున్సిపాలిటీ అధ్యక్షురాలు గీతా సోమ్ పూజారి, ఉపాధ్యక్షుడు భువన్ చౌహాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఘాసీరామ్ నాగ్, ఇతర ప్రజాప్రతినిధులు అమర జవాన్ కు నివాళులు అర్పించారు .అధికారులు ప్రజా ప్రతినిధులు అమరవీరుడి కుటుంబాన్ని ఓదార్చారు ఈ సందర్భంగా, బస్తర్ ఐజి సుందర్ రాజ్ పి. జవాన్ కుటుంబాన్ని కలుసుకుని సంతాపం తెలిపారు కుటుంబానికి సాధ్యమైనంత సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పి, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ దంతేవాడ రేంజ్ కమలోచన్ కశ్యప్, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి ఆర్ పీ ఎఫ్ ఆప్స్ బీజాపూర్ సెక్టార్ భూపేంద్ర సింగ్ నేగి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేంద్ర యాదవ్, కలెక్టర్ సంబిత్ మిశ్రా, జిల్లా పంచాయతీ సి ఈ ఓ నమ్రత చౌబే, 15వ బెటాలియన్ సి ఆర్ పీ ఎఫ్ కమాండెంట్ మయాంక్ గుర్జర్, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవీంద్ర కుమార్ మీనా, అమన్ కుమార్ ఝూ, చంద్రకాంత్ గోవర్ణ, ఏ ఎస్ పీ ఆప్స్ యులాండన్ యార్క్, డి ఎస్ పీ డి ఆర్ జి వినీత్ సాహు, డి ఎస్ పీ ఆప్స్ సుదీప్ సర్కార్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల దుశ్చర్య...


(మొదటి పేజీ తరువాయి...)

ఒక డిఆర్ జి జవాన్ అమరుడయ్యాడు. మరో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. అందిన సమాచారం ప్రకారం డి ఆర్ జి బృందం ఆదివారం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కు వెళ్లింది. సోమవారం ఉదయం సోదాల సమయంలో జవాన్లు భోపాలపట్నం ఉల్లూర్ చిల్లమర్క ప్రాంతం గుండా వెళుతుండగా నక్సలైట్లు ముందుగా అమర్చిన ఐ ఈ డి పేలింది ఈ పేలుడులో డి ఆర్ జి జవాన్ దినేష్ నాగ్ వీరమరణం పొందారు. గాయపడిన ముగ్గురు సైనికులను వెంటనే సురక్షిత ప్రదేశానికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే భద్రతా దళాలు మొత్తం ప్రాంతాన్ని చుట్టుముట్టి శోధన ఆపరేషన్ ప్రారంభించాయి. సీనియర్ అధికారులు సంఘటన స్థలానికి సంబంధించిన సమాచారాన్ని నిరంతరం సేకరిస్తున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో, ఐఈడీ పేలుళ్ల ద్వారా భద్రతా దళాలకు హాని కలిగించే ప్రయత్నాలు తరచుగా జరుగుతూ ఉన్నాయి .

## భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి...

**భద్రాచలం, ఆగస్టు 18,ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి క్రమక్రమంగా పెరుగుతోంది. ఉదయం 5 గంటలకు 34.1 అడుగులున్న గోదావరి 10 గంటలకు 35.7 అడుగులు, మధ్యాహ్నం 3 గంటలకు 37.1 అడుగులు, సాయంత్రం 4 గంటలకు 37.50 అడుగులకు చేరుకుని క్రమేపి పెరుగుతూ వస్తుంది. నిజాం సాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చిచేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి 1.60లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అంతేకాకుండా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరదవచ్చి చేరుతుండటంతో రాత్రికి ఇన్ఫ్ ఫ్లో 3లక్షల వరకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు భారీగా వరద చేరడంతోచర్ల తాలిపేరు వద్ద 17వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రాత్రికి వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ముందస్తుగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏజెన్సీప్రాంతాల్లో గర్భిణులను పీహెచ్సీలకు తరలించేలా చర్యలు చేపడుతున్నారు.

# 'దృశ్యం' పదిలం...



"కాలం పరుగెత్తుతోంది.. గడిచిన సమయం ఇక తిరిగి రాదనీ అందరికీ తెలిసిందే.. కానీ, ఆ గతం తాలూకు జ్ఞాపకాలను సజీవంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో.. అలాంటి ఫొటోలు మనల్ని ఎన్నో ఏళ్ల వెనుకకు తీసుకెళ్లగలవు.. గత మధురస్మృతులను గుర్తు చేయగలవు.. అలనాటి ఘటనలను నెమరువేయించగలవు.. అంతేకాకుండా ప్రకృతి అందాలను బంధించ గలవు.. సుందర దృశ్యాలను ఎల్లకాలం నిలిపి ఉంచగలవు.. శుభకార్యాల గుర్తులు, గతించిన మనుషుల రూపాలు, ఇతర ఎన్నో సంఘటలను చిత్రాల రూపంలో తిరిగి చూపించగలవు.. అలా ఫొటోలు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం సెల్ఫీల రూపంలో మన దైనందిన జీవితంలోకి చొరబడ్డాయని కూడా చెప్పవచ్చు. అయితే, ఈ ఫొటోగ్రఫీకి కూడా ఒక రోజు ఉంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రజాజ్యోతి అందిస్తున్న కథనం.."

- మధుర స్మృతులు శాశ్వతం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

భద్రాచలం, ప్రజాజ్యోతి

**భద్రాచలం , ఆగస్టు 18 ,ప్రజాజ్యోతి :** అందమైన, అద్భుతమైన సన్నివేశాలను కెమెరాలో భద్రపరిస్తే జీవితకాలం పదిలంగానే ఉంటాయి. నాటి జ్ఞాపకాలను ఎల్లప్పుడూ తనివి తీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చేవి ఫొటోలు. అపురూప బంధాలను, మధురమైన క్షణాలను అజరామరాం చేయడమే కాదు చరిత్రను మేలుకొలిపే శక్తి ఫొటో లకు ఉంది. దృశ్యం క్షణకాలంలో చెరిగిపోతుంది. ఆ దృశ్యాన్ని బంధీ చేసేది.. మధుర స్మృతులను శాశ్వతంగా నిలిపేది ఫొటో గ్రఫీ. ఏ శుభకార్యమైనా కెమెరా లేకుండా జరుపుకోవడం అనేది ఊహించని విషయమే. ఫొటోగ్రఫీ నాటి నుంచి నేటి వరకు అనేక ఆధునిక పోకడలను సొంతం చేసుకుంది. కెమెరాకు దాదాపు 186సంవత్సరాలు నిండాయి. ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభమైన ఛాయా చిత్ర ప్రస్థానం ఎన్నో మార్పులు చెం దింది. ప్రతి యేటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్స వాన్ని నిర్వహిస్తున్నారు.

### నేపథ్యం ఇది...

ఫొటోగ్రఫీ అనే పదం రెండు గ్రీక్ పదాల కలయిక నుంచి వచ్చింది. ఫోటో అంటే 'కాంతి'.. గ్రాఫ్ అంటే రాయడం.. అంటే కాంతితో రాయడం అనే అర్థం వస్తుంది. 1820లో ఫొటో తీసే పరికరాన్ని ఫ్రెంచి శాస్త్రవేత్త జోసఫ్ నీస్ ఫోర్ తయారుచేసి తొలి ఫోటోను తీశారు. 1839 ఆగస్టు 18న ఫ్రాన్స్కు చెందిన ఎల్ జె ఎం డాగూరే సిల్వర్ అయోడైడ్ విధానం ద్వారా దృశ్యాన్ని శాశ్వతంగా ఉంచవచ్చని నిరూ పించాడు. 1839 ఆగస్టు 19న ఈ విషయాన్ని ప్రపంచానికి చాటారు. 1839లో ఫ్రాన్స్ నుంచి ఇంగ్లాండుకు చేరితే అదే సమయంలో భారతదేశానికి వచ్చింది. 1961లో కరీంనగర్లో మొదటిసారి ఫోటోస్టూడియో ఏర్పాటు చేశారు. 1980లో కంప్యూటర్ రైజ్డ్ ప్రింటింగ్ మిషన్లతో కలర్ ఫోటోగ్రఫీ ప్రభంజనం మొదలైంది.





### సెల్ ఫోన్ లో అత్యాధునిక కెమెరాలు...

గతంలో కెమెరాలు ప్రత్యేకంగా తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతి సెల్ ఫోన్ లోనే కెమెరా అనేది సర్వసాధారణమైంది. పిండి కొద్ది రొట్టె అన్నట్లు స్మార్ట్ ఫోన్లు మార్కెట్లోకి వచ్చాక సెల్ఫోన్లలో కెమెరాల సామర్థ్యం గణనీయం గా పెరిగింది. ఫొటోగ్రఫీ మీద ఆసక్తి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా కొన్ని సెల్ఫోన్ సం స్థలు తమ ఉత్పత్తులను మార్కెట్లోకి విడు దల చేస్తున్నాయి. అవి మల్టీపర్పస్ గా ఉపయోగపడుతుండటంతో ప్రతి ఒక్కరికీ ఫొటోలు తీయడం అలవాటుగా మారింది. అందులో సంచలన ప్రక్రియగా ఇటీవల కాలంలో సెల్ఫీలు నిలుస్తున్నాయి.

### అద్భుతం.. ఆయన ఫొటోగ్రఫీ.. ఏజెన్సీ నుంచి జాతీయస్థాయికి

భద్రాచలం కు చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ క్లాసిక్ ఫొటో స్టూడియో అధి నేత షెక్ షరీఫ్ ఫొటోగ్రఫీలో అద్భుతంగా రాణిస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు . 30 ఏళ్ళుగా కళాత్మక,గిరిజన జీవనశైలి చిత్రాలు తీస్తూ ప్రశంసలు



పొందుతున్నారు. ఏ రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ పోటీలు జరిగినా ఆయన పాల్గొంటారు. 2017లో అమెరికాలోని ఇమెజ్ క్లేగ్ సొసైటీ ఫెలోషిప్ అవార్డులు రెండు అందుకుని అంతర్జాతీయ స్థాయిలో భద్రాద్రి ఖ్యాతిని చాటారు.





# మండలంలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

- హారతులతో స్వాగతం పలికిన మహిళలు.
- 8 కోట్ల95 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.





**టేకులపల్లి,ఆగస్టు18,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి రెవెన్యూ,గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు.మండలంలో ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు ఘనస్వాగతం పలికారు. మహిళలు హరతులతో స్వాగతం అడిగారు అనంతరం ముత్యాలంపాడు క్రాస్ రోడు వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లను కోరం సురేందర్ ఆధ్వర్యంలో గజమాలలతో సత్కరించారు. పర్యటనలో భాగంగా మండలంలో 8 కోట్ల95 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. పాత తండ–రాంపురం గ్రామాల మధ్య ఎత్తైన వంతెన నిర్మాణానికి 2 కోట్ల 50 లక్షల రూపాయలతో మంత్రి శంకుస్థాపన చేశారు. తార్య తండా – కోక్యతండ గ్రామాల మధ్య గల బీటీ రోడ్డు 1 కోటి 45 లక్షల నిధులతో కుడిన అభివృద్ధి పనికి శంకుస్థాపన చేశారు. పెట్రం చెలక స్టేజి – పెట్రంచెలక గ్రామం ఇబ్బందులు తొలగించడానికి రెండు కోట్ల నిధులతో ఎత్తైన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.కిష్టారం గ్రామపంచాయతీ గ్రామస్తులు గ్రామంలో ఎవరైనా మరణించిన వ్యక్తి కర్మకాండలు నిర్వహించడానికి ఎంతో అష్ట కష్టాలు పడుతున్న విషయం ఎమ్మెల్యే కోరం తెలుసుకొని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో 3 కోట్ల అభివృద్ధి నిధులతో శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం లో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తమ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధికి సహకరించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతతో వంతెనగ నిర్మించాలని వారు సూచించారు. నాణ్యతలేని బ్రిడ్జిలు ఎట్టి పరిస్థితుల్లో నిర్మించదు.అటువంటి వాటికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానం లేదని వారు తెలిపారు.టేకులపల్లి మండలం ప్రజలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య అడ్డగా వున్నాడుఅని వారు అన్నారు. అభివృద్ధి పనుల్లో ఏ పనికైనా నేను ముందు ఉంటానని వారు తెలిపారు.ప్రజల అవసరాల మేరకు చేయవలసిన రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు అందించాలని మంత్రి అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఆర్డిఓ, ఎమ్మార్వో వీర భద్రం,ఎంపీడీవో మల్లీశ్వరి,డిఎస్పీ చంద్రబాను, మార్కెట్ చైర్మన్ రాంబాబు, సీఐ బత్తుల సత్య నారాయణ, ఎస్సై ఆలకుంట రాజేందర్, బోడు ఎస్సైపి శ్రీకాంత్, ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్, గుండాల ఎస్సై రవూఫ్, అధికార సిబ్బంది, నియోజవర్గ నాయకులు కోరం సురేందర్, భూక్య దల్ సింగ్ నాయక్, డిసిసిబి చైర్మన్ లక్కినేని సురేందర్, మండల అధ్యక్షుడు భూక్య దేవనాయక్, ఇది గణేష్, సర్దార్, రవి, మహిళా ఉపాధ్యక్షురాలు బండ్ల రజిని, కంభంపాటి శ్రీనివాస్ చౌదరి, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్ కు బీఆర్ఎస్, బీజేపీ వినతి



**బూర్గంపహాడ్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి ):** మండల పశువైద్యశాల ముందున్న స్థలం ఆక్రమణకు గురైందని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులతో మాట్లాడి విషయం తెలుసుకున్న అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ప్రసాద్కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, బీఆర్ఎస్ యువజన నాయకులు చల్లకోటి పూర్ణ, సోము లక్ష్మిచైతన్యరెడ్డి, యూత్ నాయకులు సూదిపాక ఈశ్వరరావు, పంగి సురేష్, బీజేపీ నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, కన్నెబోయిన రవి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## 22, 23 తేదీల్లో మండల స్థాయి పాఠశాలల క్రీడలు :ఎంఈవో



**బూర్గంపహాడ్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో 22, 23 తేదీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో మండల స్థాయిలో పాఠశాలల క్రీడలు నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో యదుసింహరాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి పాఠశాల క్రీడల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22న బాలికలు, 23న బాలురకు బూర్గంపహాడ్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎంపిక చేసిన జట్టును పాల్వంచ జోనల్ స్థాయి పాఠశాలల క్రీడలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు యనమదల వేణుగోపాల్, కృష్ణ, సాగర్, జనార్ధన్, రాము, స్వామి, సుకన్యలు పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు కృషిచేయాలి

- గిరిజన దర్బార్ లో ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజ్

భద్రాచలం, ఆగస్టు 18,ప్రజాజ్యోతి :అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వం, ఐటీడీఏ ద్వారా అందించే సంక్షేమ పథకాలు అందించేందుకు యూనిట్ అధికారులు కృషిచేయాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఏపీవో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ సాధ్యమైనంత త్వరగా అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా ప్రత్యేక చొరవ చూపాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజనులు పెట్టుకున్న అర్జీల్లో పోడు భూములు, వ్యక్తిగత, భూ సమస్యలు, గిరిజన గురుకులాల్లో ఇంటర్మీడియట్, ఐదవతరగతిలో సీట్లు ఇప్పించడం, గిరిజన వికాసం ద్వారాబోర్లు వేసుకోవడానికి అనుమతి, ట్రైకార్ ద్వారా బోరు, కరెంటు, మోటారు వేసుకోవడానికి అనుమతులు, వితంతు పెన్షన్లు, పోడు పట్టాల పేర్లు మార్పు, కిరాణాషాపులు, ఫ్యాన్సీ స్టోర్లు పెట్టుకునేందుకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులు, ఉన్నత చదువుకు ఆర్థికసాయం తదితర వాటికి సంబంధించి అర్జీలు గిరిజనులు సమర్పించారు. గిరిజనులు సమర్పించిన అర్జీలు అన్ని ఆన్లైన్ ద్వారా నమోదు చేసి అర్హులైన ప్రతి గిరిజనులకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హరీష్, ఎస్వి భాస్కర్, కొండరెడ్ల అధికారి రాజారావు, ఏపీవో పవర్ వేణు, డీటీఆర్వోఎస్ఆర్ లక్ష్మినారాయణ, ఉద్యానాధికారి ఉదయ్కుమార్, మేనేజర్ ఆదినారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పర్యవేక్షకురాలు ప్రమీలబాయ్, హెచ్ఐవో లింగానాయక్, గురుకులం ఏవో నరేందర్, జేడీఎం హరికృష్ణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ చంద్రకళ, ఎస్ఓసీ విభాగం సిబ్బంది మోహన్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి హెల్త్ క్యాంపులు నిర్వహించాలి : బీఆర్ఎస్



**భద్రాచలం, ఆగస్టు 18,ప్రజాజ్యోతి :** గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలో వర్షం నీరు నిలిచి డ్రైనేజీల్లో మురుగునిలిచే అవకాశం ఉందని, ప్రజల ఆరోగ్యంపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి సారించి పట్టణంలోని అన్నివార్డుల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, మండల కో–కన్వీనర్ రేపాక పూర్ణచందర్రావులు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని, కాలవల్లో వ్యర్థాల కారణంగా మురుగునీరు నిలిచిపోయి దుర్వాసనతో పాటు వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని, అన్నివార్డుల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టడంతో పాటు హెల్త్క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాలను రక్షించాలని కోరారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ





**భద్రాచలం కల్చరల్ , ఆగస్టు 18,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- పాల్వంచ ఇన్చార్జ్ సీఐ నాగరాజు



**బూర్గంపహాడ్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని అశ్వారావుపేట సీఐ పాల్వంచ ఇన్చార్జ్ సీఐ నాగరాజు అన్నారు. సోమవారం బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్లో గణేష్ ఉత్సవకమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్సవకమిటీలు గణపతి విగ్రహాలను ప్రతిష్టించేందుకు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఆ 9 రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా ఒకరిని ఏర్పాటు చేసి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, లౌడ్స్పీకర్లు పెట్టవద్దని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నడుచుకోవాలన్నారు. గణేష్ ఉత్సవకమిటీల నిర్వాహకులు, సభ్యులు నియమ, నిబంధనలు పాటిస్తూ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సైలు మేడా ప్రసాద్, దేవ్సింగ్తో పాటు గణేష్ ఉత్సవకమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

## పాల్వంచ నారాయణ పాఠశాలలో విద్యార్థి క్యాబినెట్ ప్రమాణస్వీకారం

- వేడుకల్లో పాల్గొన్న పాల్వంచ డి.ఎస్.పి సతీష్ కుమార్






**పాల్వంచ (టౌన్), ఆగస్ట్ 18(ప్రజా జ్యోతి):** పాల్వంచ: స్థానిక నెహ్రూనగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో సోమవారం, 2025-26 విద్యా సంవత్సరానికి జరిగిన విద్యార్థి క్యాబినెట్ ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థుల చేత డి.ఎస్.పి సతీష్ కుమార్ ఘనంగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ హాజరై, నూతనం గా ఎన్నికైన విద్యార్థి నాయకుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమాన్ని ఖమ్మం నారాయణ పాఠశాలల ఏజిఎం రాంకీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనతో వేడుక ప్రారంభమైంది. అనంతరం అగ్ని, పృథ్వి, త్రిశూల్, నాగ హౌస్ కెప్టెన్లు, హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, జూనియర్ హెడ్ బాయ్, జూనియర్ హెడ్ గర్ల్, ఇంకా ఎనిమిది క్లబ్ కెప్టెన్లు ప్రమాణ స్వీకారం చేసి, అధికారిక బ్యాడ్జీలు, కలర్ కండువాలు అతిధుల చేత ధరించుకున్నారు. డిఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, "ఈ రోజు ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థి నాయకులు తమలో నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకొని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలి," అని సూచించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండి, ఉన్నత విలువలు అలవర్చుకోవాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు గౌరవం తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యార్థినులు ప్రదర్శించిన గణపతి నృత్యం, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, నరేష్ అద్భుత యాంకరింగ్ ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, హైస్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, రీజినల్ సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ లక్ పతి, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ నరేష్, అకడమిక్ డీన్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ రుచిత, పద్మ, ఉపాధ్యాయులు మల్లేష్, సుజిత్, రమేష్, బాలాజీ, దీప్తి, రహీమా, ప్రసాద్, తేజస్వి, ఏవో వీరా, పీఈటి వినయ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు చేపట్టాలని న్యూడెమోక్రసీ నాయకులు మంత్రికి వినతి



**టేకులపల్లి,ఆగష్టు18, ప్రజాజ్యోతి:** మండలంలోని పలు గ్రామాలలో వంతెనలు అంతర్గత రోడ్లు తదితర డిమాండ్లపై సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తుమ్మలచేలక స్టేజి నుండి సాయన్నపేట రోడ్డు నిర్మాణం, బేతంపూడి దర్గా నుండి కోటల్ల వరకు,బద్దు తండా నుండి తుమ్మలచెలక వరకు,బద్దుతండా నుండి స్మశాన వాటిక వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై మంత్రి పొంగిలేటికి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్జ మాట్లాడుతూ మండలంలో సరైన వంతెనలు లేకపోవడం వలన రహదారులు లేకపోవడం వలన ప్రజలు అవస్థలు పడుతున్నారని వారు ఆరోపించారు. తారు రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కావున తక్షణమే స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని అన్నారు. బేతంపూడి దర్గా నుండి కోటల్ల వరకు ప్రయాణం నరక యాత్రంగా ఉందనివారు అన్నారు.తుమ్మలచెలక వంతెన లేకపోవడంతో వ్యవసాయ పనులకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు.మండలంలోని వివిధ గ్రామాలలో పేరుక పోయి ఉన్న వంతెనలు, రోడ్డులను నిర్మాణం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య చిన్ని నర్సింగ్ ,చింతా లాలమ్మ, భూక్యాచంద్రు, సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, భూక్య అమర్ సింగ్ ,భూక్య చంద్రు, ఐఎఫ్టియు నాయకులు డి .ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఎమ్మెల్యే పాయం విస్తృత పర్యటన

- 5 గ్రామాల్లో రూ 75 లక్షల తో నూతనంగా నిర్మించిన 22 సిసి రోడ్లకు ప్రారంభోత్సవం.
- ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన.
- పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**పినపాక, ఆగష్టు 18(ప్రజాజ్యోతి):** మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో (ఏడూళ్ల బయ్యారం,చింతల బయ్యారం, పాతరెడ్డిపాలెం, వెంకట్రావుపేట, జగ్గారం, వెంకటేశ్వరపురం, ఎల్చిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ 75 లక్షలతో నూతనంగా నిర్మించిన 22 సిసి రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన లక్ష్యమన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలోని పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల పర్యటనలు భాగంగా పలు గ్రామాల ప్రజలు సమస్యలపై దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీల్ కుమార్, పి ఆర్ డి ఈ వస్య నాయక్, ఏ. ఈ వంశీ, విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్, ఇరిగేషన్ ఏ. ఈ నరేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వీరభద్ర స్వామి, ఆయా గ్రామ పంచాయతీల సెక్రటరీలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం, నాయకులు పేరం వెంకటేశ్వరరావు, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొర్స ఆనంద్, గొగ్గలి రామకృష్ణ, తోలేం అర్జున్, బండారు సాంబ, పొనగంటి శివకృష్ణ, మల్లయ్య, కొప్పుల వీరస్వామి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన సత్తుపల్లి డిపో ఆర్టీసీ బస్సు



**దమ్మపేట, ఆగష్టు 18 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, మందలపల్లి గ్రామం వద్ద సత్తుపల్లి నుండి అశ్వారావుపేటకు ప్రయాణికులతో వెళుతున్న సత్తుపల్లికి డిపోకి చెందిన TS04UD1719 నెంబరు గల పల్లె వెలుగు ఆర్.టి.సి బస్సు మందలపల్లి గ్రామం కొత్తచెరువు వద్ద ఎదురుగా బస్సు మీదకు వస్తున్న లారీని తప్పించ బోయి అదుపు తప్పి కాలువ లోకి వెళ్ళింది. అదృష్ట వశాత్తు ప్రయాణికులకు ఎటువంటి ప్రాణం నష్టం జరగలేదు. డ్రైవర్ చాకచక్యముగా బస్సు ను నడిపడం వల్ల ప్రమాదం జరగలేదని ప్రయాణికులు డ్రైవర్ ను ప్రశంసించారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై విచారణ చేపట్టాలని మంత్రికి వినతి



**టేకులపల్లి,ఆగష్టు18,ప్రజాజ్యోతి:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 2024 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలో అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని సోమవారం పిఆర్టియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు, బి.రవిలు టేకులపల్లి మండలం కోయగూడెంలోని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇంటి వద్ద రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అతిపెద్ద సంఘముగా చెప్పుకుంటున్న ఉపాధ్యాయ సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ద్వారా, ఇతర ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కోట్లాది రూపాయల డబ్బులు అందాయని అట్టి నగుదును ఎన్నికల్లో విచ్చలవిడిగా పంపిణీ,మద్యం పంపిణీ చేశారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిఘా వర్గాల ద్వారా విచారణ చేపట్టాలని వారు మంత్రిని కోరారు. అదేవిధంగా గతంలో ఎప్పుడూ కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ఇంత కలుషితం చేయలేదని ఉపాధ్యాయ వర్గం అంటే అందరికీ ఆదర్శప్రాయంగా ఉండేదని అదే విధంగా ఎన్నికలు కూడా ఆదర్శప్రాయంగా ఉండాలని చెప్పి ఆ విధమైన ఆదర్శ ప్రాయమైన ఎన్నికలు నిర్వహించకుండా చేసిన అభ్యర్థుల్ని, సంఘ నాయకత్వంపై తప్పనిసరిగా నిఘా వర్గాల ద్వారా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తగు చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

- సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం



**టేకులపల్లి,ఆగష్టు18,ప్రజాజ్యోతి :** మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు బుర్ర ధర్మయ్య గౌడ్, బొమ్మెర్ల వరప్రసాద్ లు మాట్లాడుతూ బడుగు, బల హీన వర్గాల ప్రజలను వేధించి న వారిపై పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయ మని వారు అన్నారు. సర్వాయి పాపన్న జయంతి వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషకరం అని వారు అన్నారు.సర్వాయి పాపన్న గౌడ స్ఫూర్తి అనుసరనియమని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని ,ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం బొమ్మనపల్లి గ్రామ పెద్దలు బండి శంకర్, మొగలగని రాజు,బుర్రి వెంకటేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు

**జూలూరుపాడు, ఆగష్టు 18(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోబహుజనల నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా జూలూరుపాడు మండల కేంద్రంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ కార్యక్రమాన్ని గౌడ సంఘం నాయకులు బండ్ల వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగాజరిగింది . బహుజనుల రాజ్యాధికార కోసం ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా తిరుగుబాటు చేసి దొరల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ కులంలో పుట్టడం గర్వంగా భావిస్తున్నట్లు చెప్పారు ఆయన ఆశయ సాధన కోసం పాటుపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు రావుల రామారావు పరస నాగరాజు గంధం రాము కళ్లెం సంపత్ రావుల సాంబ తదితరులు పాల్గొన్నారు.



# ఇన్స్పైర్ & ఇగ్నైట్ సంస్థ ఆధ్వర్యంలో ఒకరోజు ప్రేరణాత్మక శిక్షణా కార్యక్రమం

- హైదరాబాదు నుండి మోటివేషన్ స్పీకర్ల బృందం





**దమ్మపేట, ఆగస్టు 18 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, దుర్గం గొల్లగూడెం ప్రభుత్వ ఏజీహెచ్ఎస్ పాఠశాలలో ఇన్స్పైర్ & ఇగ్నైట్ సంస్థ ఆధ్వర్యంలో ఒకరోజు ప్రేరణాత్మక శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని కె. లక్ష్మారెడ్డి ఆర్థిక సౌజన్యంతో అశ్వరావుపేట శాసనసభ్యులు శ్రీ జారే ఆదినారాయణ గిరిజన విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలనే సంకల్పంతో ఏర్పాటు చేయించగా, ఇనాగరేషన్ ఏటిడబ్ల్యూఓ ఎస్.చంద్రమోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏటిడబ్ల్యూఓ ఎస్.చంద్రమోహన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యతో పాటు ధైర్యం, ఆత్మవిశ్వాసం, మానవ విలువలు పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సిహెచ్ చంద్రకళ మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు, సంభాషణా నైపుణ్యాలు పెంపొందించడంలో ఉపయోగపడతాయని తెలిపారు.

**కార్యక్రమంలోని ముఖ్య అంశాలు:**

భయాన్ని తొలగించేవి – స్టేజ్ ఫియర్ తగ్గించుకోవడం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం గురించి యు. శ్రీరామ్ విద్యార్థులను ప్రేరేపించారు. లక్ష్య నిర్దేశం & కమ్యూనికేషన్ నైపుణ్యాలు – స్మార్ట్ గోల్స్ సెట్ చేసుకోవడం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేయడం గురించి డి. సుధాకర్ వివరించారు. మైండ్ మేనేజ్‌మెంట్ & ఎమోషనల్ బ్యాలెన్సింగ్ – సానుకూల ఆలోచనలు, మైండ్ పవర్, భావోద్వేగాల సమతుల్యత గురించి ఎ.వరుణ్ బోధించారు. ఇంటర్వ్యూ నైపుణ్యాలు – ఇంటర్వ్యూలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ప్రెజెంటేషన్, బాడీ లాంగ్వేజ్ అవగాహన గురించి యు. శ్రీరామ్ సూచనలు అందించారు. మానవ విలువలు మరియు జీవన లక్ష్యాలు – మానవ విలువలు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పట్ల గౌరవం గురించి డి. సుధాకర్ విద్యార్థులకు చైతన్యం కలిగించారు. గ్రూప్ డిస్కషన్ – క్రిటికల్ థింకింగ్, లీడర్‌షిప్ మరియు పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యార్థులతో గ్రూప్ డిస్కషన్ నిర్వహించారు. కార్యక్రమం చివరగా అభిప్రాయం & ముగింపు లో విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకొని, భవిష్యత్తులో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన కె. లక్ష్మారెడ్డి ,అశ్వరావుపేట శాసనసభ్యులు శ్రీ జారే ఆదినారాయణకు ఏజీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సిహెచ్ చంద్రకళ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# రిమ్స్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ ప్రారంభిస్తున్న తళ్ళూరి ట్రస్ట్ చైర్మన్ తాలూరి పంచాక్షరయ్య

- టేకులపల్లిలో రిమ్స్ మల్టీస్పెషాలిటి హాస్పిటల్ సేవలు ప్రారంభం



**టేకులపల్లి,ఆగష్టు18,ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా రిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను సోమవారం తళ్ళూరి ట్రస్ట్ చైర్మన్ పంచాక్షరయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రవిబాబు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతూ అత్యాధునిక వైద్య పరికరాలు,నిపుణులైన వైద్యులతో ఏజెన్సీ ప్రాంతంలో రిమ్స్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ ఏర్పాటు అభినందనీయమని అన్నారు. గిరిజన ప్రాంతంలోని ప్రజలుకు హాస్పిటల్ లో 24గంటల సేవలను మండలం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.రిమ్స్ హాస్పిటల్లో జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, చిన్నపిల్లలు వైద్యులు, ప్రసూతి వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవాలు అందించానున్నారని తెలిపారు. టేకులపల్లి మండలాల్లోని ప్రజలందరూ రిమ్స్ హాస్పటల్ సదుపాయాలను చదివినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు నరేష్, మౌనిక, శంషాద్ బేగం, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు వినోద్ రైనా,మౌలానా, గ్రామస్తులు ధారవత్ బాలాజీ , పూల్సింగ్, రవి, నాగేశ్వరరావు,సురేష్, కుమార్, పాల్గొన్నారు.

# జిల్లా మైనారిటీ కార్యదర్శిగా ఇబ్రహీమ్



**ఇల్లందు, ఆగస్ట్ 18, ప్రజాజ్యోతి:** డిసిసి అనుబంధ జిల్లా మైనారిటీ కార్యదర్శిగా పట్టణానికి చెందిన యండి. ఇబ్రహీమ్ ను జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ నియమించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీమ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, టిపిసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మైనారిటీ విభాగం ఏఐసిసి చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి, టిపిసీసీ మైనారిటీ ఇంచార్జ్ షకీల్ అహ్మద్, డిసిసి అధ్యక్షుడు, ఏఐసిసి సభ్యుడు, తెలంగాణ అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య, ఇల్లందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, తనకు ఈ పది వచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, నాయకులు, చిల్లా శ్రీనివాస్, డి. శివ, మున్నా, నాయకులు పాల్గొన్నారు.

# అయ్యా.. యురియా కట్టలు అందించండి

- యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు.
- ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలి.

**పాల్వంచ(రూరల్),ఆగష్టు 18,ప్రజా జ్యోతి:** పాల్వంచ సొసైటీలో రైతులకు కేవలం రెండు బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారు.రైతుల యూరియా అందాక చాలా కష్టాలు పడుతున్నాం అన్ని,రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవటం బాధాకరం అని రైతులు ఆవేదన వెకత్యం చేస్తున్నారు.పాల్వంచ సొసైటీ కార్యాలయంలో రైతులకు రెండు యూరియా కట్టలు ఇవ్వడం,గత ప్రభుత్వం తో పోలిస్తే ప్రభుత్వం యూరియా కట్టలు అందిచడంలో పూర్తిగా విఫలమైనట్టుగా కనిపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరకు ఉదయాన్నే వచ్చి క్యూ కట్టే పరిస్థితి ఎందుకు ఏర్పడుతుందనేది ప్రశ్నార్ధకంగా మిగిలిందని.తక్షణమే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకొని సొసైటీలో యూరియా కొరత లేకుండా చూడాలంటూ రైతుల ఆవేదన వ్యక్త చేశారు.





# కేసులను సత్వరమే పరిష్కరించాలి

- పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్







**ములకలపల్లి, ఆగస్టు 18, ప్రజా జ్యోతి:** పోలీస్ స్టేషన్ కు వచ్చిన కేసులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పరిసరాలను పరిశీలించి, స్టేషన్ లోని రికార్డులను తనిఖీ చేశా స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటారు. సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సిబ్బందికి సూచించారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుల పట్ల మర్యాదగా ప్రవరిస్తూ, ఫ్రెండ్లి పోలీసింగ్ చేయాలన్నారు. కేసులను పెండింగ్ లో లేకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకివాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ మధుప్రసాద్, ఏఎస్ఐ పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐ మధుప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నరాటి

**ములకలపల్లి, ఆగస్టు 18, ప్రజాజ్యోతి:** నూతనంగా ములకలపల్లి పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఐ మధుప్రసాద్ ను సోమవారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ ఆ పార్టీ మండల నాయకులతో కలిసి సోమవారం ములకలపల్లి పోలీస్ స్టేషన్ లో నూతనం గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఐ మధుప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలసి, దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ మండల కార్యదర్శి ఎండి యూసఫ్, సహాయ కార్యదర్శి నరాటి రమేష్, నాయకులు వీరు నాయక్, ఇమాన్యూల్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత?

- డిపోకు తరలించిన టాస్క్ ఫోర్స్, అటవీ శాఖ సిబ్బంది!



**ఇల్లందు, ఆగస్ట్ 18, ప్రజా జ్యోతి:** మండలంలోని ఓ గ్రామం నుండి లారీలో తరలిస్తున్న కలపను పక్కా సమాచారం మేరకు సోమవారం టాస్క్ ఫోర్స్, అడవీ శాఖ సిబ్బంది పట్టుకొని కలప డిపోకు తరలించిన్నట్లు సమాచారం. అటవీ శాఖ కలప డిపోలో టాస్క్ ఫోర్స్, అటవీ శాఖ సిబ్బంది ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని వినతి



**ఇల్లందు, ఆగస్ట్ 18, ప్రజాజ్యోతి:** జెకె 5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ ద్వారా భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ కు అఖిలపక్షం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ తమ తాతలు, తండ్రుల కాలం నాటి నుండి షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తూ అక్కడ ఉన్న కొద్దిపాటి భూములను సేద్యం చేస్తూ ఆదివాసీ గిరిజన రైతులు జీవనం కొనసాగించడం జరుగుతుందన్నారు. వ్యవసాయం చేసుకుంటున్న భూములను సింగరేణి యాజమాన్యం బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నం చేస్తుందని, మీకు ఇక్కడ భూమి లేదని, రైతులు సాగు చేసుకుంటున్న భూముల నుండి వెళ్లగొట్టేలా భయభ్రాంతులకు గురిచేస్తూ నానా ఇబ్బందులు పెడుతుందని తెలిపారు. గతంలో జెకె ఓసి అనుమతి కోసం 24 ఏరియా వైసీఓఏ క్లబ్ లో నిర్వహించిన గ్రామసభలో అప్పటి ఆర్డిఓ రైతులు సాగుచేసుకుంటున్న భూములు ప్రాజెక్ట్ లో కోల్పోతే వారికి భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం అధికారులు మాట మార్చి పరిహారం ఇచ్చేది లేదని చెప్తున్నారని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ పంచాయతీలలో సొంత ఇల్లు కోల్పోతున్న వారికి కూడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇండ్లకు నష్టపరిహారం చెల్లించాలని, 18 ఏళ్ళు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ వర్తింప చేయాలని, నిరుద్యోగులకు ప్రాజెక్ట్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపిటిసి పూనెం సురేందర్, అఖిలపక్ష నాయకులు అబ్దుల్ నబీ, బొప్పిశెట్టి సత్యనారాయణ, ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీను, క్లింట్ రోచ్, తేజావత్ లాలు, తాండ్ర నాగరాజు, సదరం మహేష్, చందావత్ రమేష్ రైతులు బాణోత్ గణేష్, రమేష్, నరేష్, సురేష్, రాములు, కౌసల్య, అరుణ, వినోద, అనిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి



**చర్ల, ఆగష్టు 18:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ స్పందన సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంని సందర్శించి రోజు వారీ ఓ.పి రిజిస్టర్ లో జ్వరాలకు సంబంధించి నమోదు ఎలా ఉంది అని రికార్డ్స్ చూడడం జరిగింది. ల్యాబ్ లో రికార్డులను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్ కు ప్రస్తుత సీజన్ కు అనుగుణంగా వేరు వేరు రిజిస్టర్ లు నమోదు చెయ్యాలి అని సూచించారు. టి హబ్ కి ప్రతి జ్వరం కేస్ కి సంభందించిన రక్త నమూనాలు తప్పకుండా పంపాలని అన్నారు . ఐ ఎల్ ఆర్ కు సంబందించిన రికార్డ్స్ ని పరిశీలించడం జరిగింది ఈ సందర్భగా లేబర్ వార్డ్ లో కాన్పు అయిన తల్లులకు వారికి అందుతున్న సేవల గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ డి డి కి ఉన్న ప్రతి గర్భిణీ స్త్రీని ముందుగానే కాన్పు కోసం పి హెచ్ సి కి రమ్మని చెప్పగలరు అని అన్నారు .వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి రాపిడ్ ఫీవర్ సర్వే తప్పకుండా చేయాలనీ చెప్పడం జరిగింది.ఆర్ ఏం పీ లతో మీటింగ్ పెట్టి చిరు వ్యాధులకు మాత్రమే చికిత్స చెయ్యాలి అని జ్వర పీడుతుల రికార్డ్ తప్పకుండా పెట్టుకోవాలని ఏదైనా ప్రమాదకర లక్షణాలు ఉన్న కేస్ వస్తే తప్పకుండా పి హెచ్ సి పంపాలి అని ఆర్ ఏం పీ లకు చెప్పగలరు అని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రాం అధికారిని డాక్టర్ స్పందన , పి హెచ్ సి డాక్టర్స్ డాక్టర్ దివ్య నయన డాక్టర్ నగేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

## బెదిరింపులను తీవ్రంగా ఖండించిన తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ, జిల్లా జనరల్ సెక్రటరీ బెల్లంకొండ రామారావు

- **నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపిన దమ్మ పేట మండల మీసేవ కేంద్రాల నిర్వాహకులు**









**దమ్మపేట, ఆగష్టు 18,(ప్రజాజ్యోతి):** ఇటీవల హయత్ నగర్ పరిధిలో సి.జె. అరుణ్ కుమార్ మీసేవ సెంటర్ పై తప్పుడు పత్రాలతో సెంటర్ నడుపుతున్నారని పేర్కొంటూ ఫిర్యాదు దారుడు యం.వీ.కె ప్రసాద్ అనే వ్యక్తి , నేరుగా తెలంగాణ మీసేవ ఇ.యస్.డి కమిషనర్ శ్రీ రవికిరణ్ ను వ్యక్తిగతంగా వెళ్ళి బెదిరించడం జరిగింది. ఈ చర్యను తెలంగాణ మీసేవ ఫెడరేషన్(టి.జి. యం.యఫ్) రాష్ట్ర కమిటీ, మరియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్రంలోని అన్నీ మీసేవ కేంద్రాలు నల్ల బాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చిన సందర్భముగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,దమ్మపేట మండలం,మందలపల్లి మీసేవా సెంటర్ నిర్వాహకుడు, తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ, జిల్లా జనరల్ సెక్రటరీ బెల్లంకొండ రామారావు నల్ల బాడ్జీ ధరించి నిరసన తెలియజేసారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మీసేవ సెంటర్లకు సంబంధించిన సమస్యలు ఎవరికైన ఉన్నట్లయితే , అవి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం సంబంధిత మార్గాల ద్వారా పరిష్కరించుకోవలసిన అవసరం ఉంది. కానీ నేరుగా కమిషనర్ కార్యాలయంలోకి వెళ్లి మీసేవ కమిషనర్ శ్రీ రవికిరణ్ ను వ్యక్తిగతంగా బెదిరించడం అనేది సహించరాని చర్య అని ఇలాంటి వ్యక్తులపై చట్టపరంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేసారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన తెలియజేశారు.మీసేవ నిర్వాహకులు ఎల్లప్పుడూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మీసేవ కేంద్రాలను నడపడానికి, ప్రజలకు పారదర్శకంగా సేవలందించడానికి కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.నిరసన తెలిపిన వారిలో దమ్మపేట మండలంకు చెందిన మీసేవ నిర్వాహకులు ఉదయగిరి శివ కోటేశ్వరరావు,పూనెం రఘురాం ధారావతు మహేశ్వరరావు,అప్పన్న ఉన్నారు.

## పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుని అభినందించిన జడ్జి మండా వెంకటేశ్వరరావు



**భద్రాచలం టౌన్, ఆగష్టు 18(ప్రజాజ్యోతి):** కేరళ రాష్ట్రంలో ఆగస్టు 2 నుండి 7 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా చరిత్రలో సరికొత్త అధ్యయనాన్ని సృష్టించడమే కాకుండా 4 బంగారు పతకాలు సాధించిన భద్రాచలం సిటీస్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావు ను భద్రాచలం స్థానికులైన కూకట్ పల్లి జడ్జి మండా వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73 సంవత్సరాల వయసులో హార్ట్ బైపాస్ సర్జరీని సైతం లెక్కచేయకుండా ఆరు నెలల అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటి కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చారని ఈ సందర్భంగా తెలిపారు.పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని గుర్తు చేశారు. డివి శంకర్రావుకు శిక్షణ ఇచ్చిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి వి రామిరెడ్డి ని, ఇంటెన్సివ్ ట్రైనర్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ ని, ప్రత్యక్షంగా పరోక్షంగా ఆయన వెంటే ఉండి నిత్యం నడిపించే మహంతి వెంకటకృష్ణాజీని, గుగులోతు శోభనాయక్ ని కూడా అభినందించడం జరిగింది. ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా రాణించి ఇండియాకు మంచి కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలని సూచించారు.తను కూడా ఇంతకుముందు భద్రాచలంలో జీవీ రామిరెడ్డి దగ్గర పవరలిఫ్టింగ్ లో ట్రైనింగ్ తీసుకున్న రోజులు గుర్తుచేసుకుని, డీవీ శంకర్రావు గారి స్ఫూర్తితో 100కేజీ ల డెడ్ లిఫ్ట్ ని ఏత్తడం అనేది వారికి క్రీడల యందు వున్నా ఆసక్తి శ్రద్దను కనబరుస్తున్నాయని పవర్ లిఫ్టింగ్ అధ్యక్షులు భోగాల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## ఎర్రగుంట పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి

- **జాతీయ నులిపురుగుల నిర్మూలన మాప్-అప్ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**



**అన్నపురెడ్డిపల్లి,ఆగస్టు 18, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ తేజ సందర్శించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన మాప్–అప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, గతంలో వివిధ కారణాల వల్ల మాత్రలు వాడని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.ఈ సందర్భంగా డాక్టర్ తేజ మాట్లాడుతూ, ఈ జాతీయ స్థాయి కార్యక్రమం పిల్లలలో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. నులిపురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, పోషకాహార లోపం, రక్తహీనత, పాఠశాల హాజరు తగ్గిపోవడం వంటి సమస్యలకు దారితీస్తాయని, ఇది వారి శారీరక మరియు మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.ఆల్బెండజోల్ మాత్రలు నులిపురుగులను సమర్థవంతంగా నివారిస్తాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తన్మయి, పీహెచ్ఎన్ ఎస్తేరు రాణి, హెల్త్ ఎడ్యుకేషన్ జయలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ప్రకాష్‌రావు, ఆరోగ్య కార్యకర్త ప్రేమలత మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.